ప్రజాశక్తి

శుక్రవారం 7 జులై 2023 5 విజయనగరం



నేటి నుంచి మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నగరంలో నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 9న తన నివాసంలో ఉంటారు. 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు వల్లంపూడి లో, సాయంత్రం 4 గంటలకు గుర్ల మండలం పకీరుకిత్తలిలో గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభిస్తారు. 11వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో రాజాంలో నిర్మించనున్న ఆర్టీసీ బస్సు స్టాండ్ కు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ చేరుకొని విజయవాడ వెళ్లనున్నారు.



అన్నీ అసంపూర్తే

జిల్లాలో తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు, వాటికి భూములు త్యాగం చేసిన ప్రజానీకానికి పునరావాసం, నష్టపరిహారం మొదలుకుని అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అన్నీ అరకొరగాను, అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పంటలకు అవసరమైన వరి, మొక్కజొన్న తదితర విత్తనాలైనా సకాలంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించగలదా? అన్న ఆందోళనతో ప్రజానీకంలో నెలకొంది. మరోవైపు ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో జనం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. మరోవైపు వర్షాకాల సీజన్ మొదలవ్వడంతో వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో గురువారం జరగబోయే జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో పై అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందా? లేదా అన్నదానిపై సర్వత్రా చర్చసాగుతోంది.

- పనుల పెండింగ్‌తో పూర్తిస్థాయిలో అందని తోటపల్లి నీరు
- అరకొరగా పునరావాసం - నత్తనడకన గృహ నిర్మాణం
- పూర్తికాని నాడు - నేడు పనులు
- విత్తనాలైనా సకాలంలో అందేనా?
- విద్యుత్తు ఛార్జీల పెంపుపై ప్రజల్లో ఆందోళన
- నేడు జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చినా వర్షాభావం వెంటాడుతోంది. ఇప్పటికీ జిల్లాలో 34.9 మిల్లీ మీటర్ల వర్షం లోటు ఉంది. మరోవైపు జలాశయాల్లో నీరు తమ వరకు వస్తుందన్న దీమా రైతుల్లో లేదు. దాదాపు జిల్లాలోని అన్ని జలాశయాలు, కాలువల నిర్మాణం, నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉండడమే ఇందుకు కారణం. విజయనగరం, పార్వతీపురం జిల్లాలతోపాటు శ్రీకాకుళం జిల్లా కలిపి 2,10,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన తోటపల్లి జలాశయం పనులు ప్రభుత్వ దృష్టిలో పూర్తయ్యాయి. ఇంకా చిన్నా చితక కాలువల నిర్మాణం ఉందని ప్రభుత్వం చెబుతోంది. కానీ, పిల్లకాలువలు, స్ట్రక్చర్లు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం, ప్రధాన కాలువ నిర్వహణ సైతం సరిగా లేకపోవడం వల్ల శివారు ఆయుకట్టుకు సాగునీరు అందడం లేదు. కాలువల నిర్మాణంలో లోపం వల్ల ఇటీవల రెండు చోట్ల గండ్లు పడ్డాయి. తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించు కోలేకపోయారు. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్, ఆంధ్ర, తాటిపూడి, జంఝావతి తదితర జలాశయాల కాలువలు నిర్వహణ, అభివృద్ధి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఓవైపు వర్షాభావం వెంటాడుతుండడం, మరోవైపు సాగునీటి వనరుల అభివృద్ధి అసంపూర్తిగా ఉండడంతో ఖరీఫ్ పంటలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

2004లో తలపెట్టిన రామతీర్థసాగర్ నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం కల్పించలేదు. ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74కోట్లు అవసరం కానుందని 2016లో అధికారులు అంచనా రూపొందించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల పెరిగిన ధరల నేపథ్యంలో రూ.87కోట్లు వరకూ పెరిగేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు.

ప్రభుత్వం అత్యంత ప్రతిషాత్మకంగా భావిస్తున్న గృహ నిర్మాణం కూడా నత్తనడకన సాగుతోంది. జిల్లాలో 77,205 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు కేవలం 50శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా చెప్పున్న గుంకలాంలో 10,136 ఇళ్లకుగాను ఇప్పటివరకు 242 మాత్రమే పూర్తయ్యాయి. రూ.220కోట్లతో తలపెట్టిన రెండో విడత నాడు - నేడు పనులు నేటికీ చాలా స్కూళ్లలో అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం 737స్కూళ్లకుగాను కేవలం 117స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ముఖ్యంగా పనుల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, హెచ్‌ఎంలతో సంబంధం లేకుండా పనులన్నీ జరిగిపోతున్నాయని సర్వత్రా చర్చసాగుతోంది. ప్రైవేటు స్కూళ్లల్లో పుస్తకాల పేరిట భారీగా వసూళ్లకు పాల్పడుతుండడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటింటికీ రేషన్ అంటూనే సరుకుల్లో కోత విధిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాల్సింది. కానీ, చాలా ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో లేవు. ముఖ్యంగా సుగర్, థైరాయిడ్ వంటి రక్త పరీక్షలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేవు. ఈనేపథ్యంలో వీటన్నింటిపైనా జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సమగ్రంగా చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

ఇద్దరు మృతి.. ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని సంతగైరమ్మపేట జంక్షన్ వద్ద ఆగివున్న ఆటోను వెనుక నుంచి ట్రాక్టర్ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎస్.కోట నుంచి మండలంలోని అలుగుబిల్లి గ్రామానికి ఆటో వెళ్తుంది. ఈ ఆటోలో ఏడుగురు వ్యక్తులు వున్నారు. ఆటో సంతగైరమ్మపేట గ్రామానికి రాగానే ఆటో డ్రైవర్ తన ఇంటి అవసర నిమిత్తం పశువులకు దాణా కొనుగోలు చేసేందుకు రోడ్డుకు పక్కగా ఆటో ఆపి దుకాణానికి వెళ్లాడు. ఇదే సమయంలో ఎస్. కోట నుంచి జామి వెళ్తున్న సీతంపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ట్రాక్టర్ బోల్తా పడ్డాయి. సంఘటన స్థలంలో సంతగైరమ్మ పేటకు చెందిన గోగాడ సత్యం(68) ఆటో కిందపడి మృతి చెందాడు. మిగిలిన క్షతగాత్రులను ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అలుగుబిల్లి గ్రామానికి చెందిన ముంత ముసలయ్య (70) మృతి చెందాడు. అయితే ఈ ప్రమాదంలో జామి వసంత, మంత బంగారమ్మ, భీర మనిషా అనే బాలికతో పాటు కుంద్ర అచ్చియమ్మలు గాయాలు కావడంతో వీరిని విశాఖ కెజీహెచ్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఈ ప్రమాదానికి కారణమని అంటున్నారు. ఎస్.ఐ తారకేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాపు చేపట్టారు.

మరో పదినిమిషాలలో ఇంటికి చేరుకుంటారనగా

ఈ ఆటోలో వున్న ప్రయాణికులు మరో పదినిమిషాలలో తమ గమ్య స్థానాలకు చేరుకుంటారన్న సమయంలో వారిని మృత్యువు కబలించడం పలువురుని కంటతడి పెట్టించింది. ఈ ప్రమాద విషయం తెలియగానే వందలాదిమంది ప్రజలు గుమిగూడి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

అధికార పార్టీలో అసహనం

ప్రజాశక్తి - జామి

అధికార వైసిపి పార్టీలో రోజురోజుకూ అసహనం పెరుగుతోంది. నియోజకవర్గ నాయకులు మధ్య విబేధాలు మండల స్థాయిలో బట్టబయలవుతున్నాయి. తాజాగా స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు అసహనం బయటపడింది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ వర్గీయులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును వ్యతిరేకిస్తూ, నిప్పులు చెరుగుతూనే ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీ నేరుగా తమ సొంత పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. గురువారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి తాను వస్తున్నానని తెలిసి, ఎందుకు ముగించారంటూ, ముగిసిన సభా వేదికపై కూర్చుని ఎంపిడిఒ పై ఎమ్మెల్సీ మండిపడడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే జెడ్‌పిటిసి సరయు చర్చ పూర్తయ్యాకే సమావేశం ముగిసిందని సమాధానం చెప్పడంతో ఎమ్మెల్సీ, జెడ్‌పిటిసిల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఒకే పార్టీకి చెందిన వారైనా, ఇలా వాగ్వివాదం చేసుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి ఇది యాధృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదన్న చర్చ లేకపోలేదు. నిన్నటికి నిన్న తాటిపూడి జలాశయం నీరు విడుదల కార్యక్రమంలో జెడ్‌పిటిసి భర్త, మండల పార్టీ కన్వీనర్ రవికు మార్ తనను చూసి లేచి నిలబడ లేదని ఎమ్మెల్సీ ఆగ్రహం

ఎమ్మెల్సీ, జెడ్‌పిటిసి మధ్య వాగ్వివాదం

వ్యక్తం చేసిన సంఘట చోటుచేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ నేరుగా మీరు ప్రోటోకాల్ పాటించారా..? అంటూ ప్రశ్నించడం, తాజాగా సర్వసభ్య సమావేశానికి వస్తున్నానని తెలిసి ముగించడం ఏంటని ప్రశ్నించడం రెండూ విబేధాలు నుంచి బయటపడ్డ అసహ నంగానే కనిపిస్తుందన్న చర్చ లేకపోలేదు. వాస్తవానికి నియోజక వర్గంలో ఎమ్మెల్యే కడుబండి పై ఎమ్మెల్సీ వర్గీయులు ఎప్పటిక ప్పుడు నిరసన గళం వినిపిస్తూనే ఉన్నారు. ఏకంగా జిల్లా మంత్రి బొత్స సభలోనూ ఎమ్మెల్సీ భార్య నేరుగా, ఎమ్మెల్యేను విభేదించిన సంఘటన చూశాం. పనిగట్టుకుని ప్రెస్ మీట్‌లు పెట్టడం, పోస్టర్లు ఏర్పాటు చేయడం, ఫిర్యాదులు చేయడం వంటి పరిణా మాలు చోటు చేసుకున్నాయి. కానీ ఎక్కడా, ఎమ్మెల్యే గానీ, ఆయన సానుభూతి పరులుగా ఉన్న మండల నాయకులు ఎదురుదాడి చేయలేదు. చివరికి ఎస్.కోట పట్టణంలో గడప గడప కార్యక్రమం ఎమ్మెల్సీ లేకుండా ఎమ్మెల్యే నిర్వహించడం, ఆ కార్యక్రమానికి అన్ని మండలాల నాయకత్వం హాజరు కావడం విబేధాలు ఆజ్యం పోసినట్లు చేసినదన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే సానుభూతి పరులపై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అధికార పార్టీలో ఇద్దరు కీలక నేతల మధ్య విబేధాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి.

పారిశుధ్య సేవలు విస్తృతం

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సమన్వయంతో సమర్థవంతమైన సేవలు విస్తృతం చేయాలని పారిశుధ్య పర్యవేక్షకులకు, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. క్లాప్ యూజర్ ఛార్జీలను ముమ్మరం చేయాలని చెప్పారు. ఐదు డివిజన్లకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ చొప్పున యూజర్ ఛార్జీలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ పరస్పర సహకారంతో నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య విధానాలపై సమర్థవంతమైన సేవలను అందించాలని కోరారు.

కెజిబివి పిజిటి, టిజిటి పోస్టుల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెజి బివి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గురువారం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో కౌన్సిలింగ్ జరిగింది. 111 పిజిటి, టిజిటి పోస్టులకు జరిగిన కౌన్సిలింగ్‌లో అభ్యర్థులు ఖాళీలను బట్టి కోరుకున్న ప్లేస్ లో వెంటనే పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. కౌన్సిలింగ్ లో జిల్లా విద్యా శాఖ అధికారి బి. లింగేశ్వర రెడ్డి, జిసిడిఒ తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరిజన పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ అటవీ హక్కు చట్ట ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల భూమి ఇవ్వాల్సి ఉన్నా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం గిరిజన హక్కులకు వ్యతిరేకంగా జాతీయ నూతన ఆటవీపాలసీ విధానాన్ని తీసుకొచ్చి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన అటవీ పాలసీ విధానం గిరిజనుల వినాశనానికేనని అన్నారు. చట్ట ప్రకారం గిరిజనులకు పోడుపట్టాలివ్వాల్సి ఉన్నా మోడీ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా విధానాలు తీసుకొస్తున్నప్పటికీ రాష్ట్రంలోని వైసిపి గాని, టిడిపి గాని, జనసేన గాని వ్యతిరేకించడం లేదని అన్నారు. ఇప్పటికైనా గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని. పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలో 273 మంది రైతులు పోడు సాగు చేస్తున్నారని, మరి కొంతమంది గిరిజనుల సాగులో ఉన్న భూమికి సర్వేలు కూడా చేపట్టలేదని అన్నారు. సాగులో ఉన్న రైతుల భూములను ఫారెస్ట్, ఐటిడిఎ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టి గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేయాలిని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులోగా గిరిజన సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆగస్టు మొదటివారం నుంచి తాహశీల్దార్ కార్యాలయం ముందు వద్ద నిరవధిక నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, గిరిజన సంఘం సభ్యులు గెమ్మిల సన్యాసిరావు,సిధరి రాము, సుబ్బారావు, సిదరి సూరి, యం. కీష్ణ, రమేష్, సీతయ్య, శివ, తులసి, సీతమ్మ రాధా, గిరిజనులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ


సిటియు విసికి భూమి పత్రాలు అందిస్తున్న ఎస్‌డిసి సుదర్శన్‌దొర

గిరిజన యూనివర్శిటీకి భూమి అప్పగింత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ ఏర్పాటుకు కేటాయించిన 519 ఎకరాల భూమిని జిల్లా రెవిన్యూ యంత్రాంగం గురువారం అప్పగించింది. విజయనగరం జిల్లా ప్రత్యేక ఉప కలెక్టర్ బి. సుదర్శన్ దొర, మెంటాడ మండల తహసీల్దార్ రామకృష్ణ, దత్తిరాజేరు మండల తహశీల్దార్ గురుమూర్తి చేతులమీదుగా సిటియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమనికి భూమి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమని మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం 2014 హామీ ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కేటాయించారని తెలిపారు. దానికి సంబంధించిన తరగతులు కూడా 2019 సంవత్సరంలో ప్రారంభమయ్యాయని, నేటికీ తాత్కాలిక భవనాలలోనే తరగతులను నడుపుతున్నామని తెలిపారు. తాజాగా సిటియుకు భూమి అప్పగించడం అభినందనీయమని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలలను సాకారం చేసేందుకు, గిరిజనులు విద్యాభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఇక నుంచి విశ్వ విద్యాలయ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

మరుగుదొడ్లు లేకపోవడమే కారణం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలో పతివాడ గ్రామానికి చెందిన మూడో తరగతి బాలికపై అత్యాచారం జరగడానికి గల కారణం మరుగుదొడ్లు పనిచేయక పోవడమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు సుమారు 70 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే పాఠశాలలో కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడం ఘోరం అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్డి రెండేళ్ల కిందటే మరమ్మతులు గుర్తైనా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇంకో మరుగుదొడ్డి ఉన్నా అది కేవలం ఉపాధ్యాయులు మాత్రమే వాడుతారు అన్నారు. దాంతో ఇంటర్వెల్ సమయంలో, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు మలమూత్ర విసర్జనకు ఆరు బయట పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. మూత్ర విసర్జన కోసం బాలిక పాఠశాల వెనుక పక్క పొలాల్లోకి వెళ్లడం వల్లే అత్యాచారం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు-నేడు పనుల్లోనైనా మరుగుదొడ్డు మరమ్మత్తులు చేయించకపోవడం అన్యాయమంటున్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయండి

సిసిఎల్ఎ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-గజపతినగరం

సకాలంలో భూసర్వే పూర్తి చేసి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలని జాయింట్ సెక్రటరీఆఫ్ సిసిఎల్ఎ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. శాశ్వత జగనన్న భుహక్కు - భూరక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్‌జిఆర్ పురం, కొత్త బగ్గాం గ్రామాల్లో చేపడుతున్న భూ రీ-సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో భూసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎడి త్రివిక్రమ్, డిఐఒ నారాయణరావు, తాహశీల్దార్ ఎం.అరుణ కుమారి, డిటి జోగి నాయుడు, మండల సర్వేయర్ భవాని, విఆర్ఒ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ సెక్రటరీ ఆఫ్ సిసిఎల్ఎ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. సీతారాంపురం, పిడిశీల, కొనిశ గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం 11 రకాల సేవలను ఉచితంగా ప్రజలకు అందిస్తుందని అన్నారు. సుమారు 950 లబ్ధిదారులకు ఈ సందర్భంగా ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.అరుణకుమారి, జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, సర్పంచులు తుంపల్లి కాంతమ్మ, పాంద్రంకి మాధవి తదితరులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి

ట్రైన్ థీమ్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

ప్లాట్‌ఫామ్ 65పేరిట విజయనగరంలో ట్రైన్ థీమ్ రెస్టారెంట్ గురువారం ప్రారంభమైంది. బాలాజీ జంక్షన్‌లోని రిలయన్స్ స్మార్ట్ మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ రెస్టారెంట్ ముందు భాగం రైల్వే స్టేషన్ లాగా కనిపించేలా డిజైన్ చేశారు. ఇక్కడ సీట్లు రైలును పోలి ఉంటాయి. టేబుళ్లకు వివిధ స్టేషన్ల పేర్లు పెట్టారు. మినీ రైల్వే ట్రాక్ లు ఉన్నాయి. ఆర్డర్ ఇచ్చిన ఆహారం రైలులోని వ్యాగన్లతో వచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ 'వినూత్నమైన, రుచికరమైన వంటకాలను మన ఇంటి వద్దకు తీసుకురావడానికి ప్లాట్ఫామ్ 65 వెనుక ఉన్న బృందం కషి అభినందనీయమని అన్నారు. ప్లాట్‌ఫాం 65 మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు శ్రీ సద్గుణ్ పాఠా మాట్లాడుతూ అత్యుత్తమ భోజన అనుభవాలను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలోఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోజా ఏడుబిల్లి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, సిజిఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కోలగట్ల

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

విజయనగరంటౌన్ : పద్మావతినగర్ పివిఆర్ కాలనీకి చెందిన వై.ఎ.రామారావు హృద్రోగ సమస్యతో మంచానపడ్డారు. చికిత్స నిమిత్తం రూ.10 లక్షలకుపైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత డబ్బు సమకూర్చే స్తోమత లేని రామారావు కుటుంబ సభ్యులు కోలగట్ల వీరభద్రస్వామిని కలిసి తమ దీనస్థితిని వివరించారు. స్పందించిన ఆయన.. ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రతిపాదించారు. బాధితుడి వైద్యానికి సరిపడా రూ.10 లక్షల మొత్తానికి సంబంధించి లేఖను ఆస్పత్రికి పంపించారు.

జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-విజయనగరం

పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు సంక్రమించకుండా జంతు ప్రేమికులు, సంరక్షకులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సకాలంలో టీకాలు వేయించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పశు సంవర్ధక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనకిష్టమైన జంతువుల నుంచి మనకు తెలియకుండానే రేబిస్, మెదడువాపు, బర్డ్ ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంథ్రాక్స్ వంటి అనేక రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తరచూ వైద్య పరీక్షలు చేయించాలని, పరిశుభ్రత పాటించాలని చెప్పారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవటంతో పాటు పెంపుడు జంతువులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ డిడి వైవి రమణ , స్థానిక కార్పొరేటర్ ఎవర్ణ విజయలక్ష్మి, ఉప సంచాలకులు వివి భాస్కర రాజు, డాక్టర్ దామోదర రావు, సహాయ సంచాలకులు డాక్టర్ కెవి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్టీసీ డిపోలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన డిపో వద్ద కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి వి.రాములు మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన ఎనిమిది నెలల పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీ డిస్పెన్సరీ సిక్‌లకు వేతనం చెల్లించాలన్నారు. అవసరమైనంత మంది సిబ్బందిని డిపోకు రప్పించి అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులకు సెలవు మంజూరు చేయాలని, సర్క్యులర్ ప్రకారం మహిళా ఉద్యోగులకు మూడు రోజుల లీవు మంజూరు చేయాలని కోరారు. అలవెన్సు ఏ నెలకానెల జీతంతో పాటు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు సిహెచ్‌వి రావు, డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య, కె.ఆర్.కుమార్, ఇవి రావు, ఎస్‌బి నాయుడు, ఆర్‌కె రాజు, ఎస్‌పి బాబు తదితరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 8,9 తేదీల్లో జిల్లా స్థాయి అండర్17, అండర్ 19 బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘు రాజు తెలిపారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో త్వరలో జరగనున్న జిల్లాస్థాయి సెలెక్షన్స్ టోర్నమెంట్ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ పోటీలలో పాల్గొనబోవు క్రీడాకారులు అండర్ -17 సింగిల్స్ కు రూ.300, డబుల్స్‌కు రూ.600 ప్రవేశ రుసుం, అండర్ 19 పురుషుల, మహిళల పోటీలకు సింగిల్స్ రూ.500, డబుల్స్ రూ.1,000 ప్రవేశ రుసుం ఈనెల 7లోగా చెల్లించాలని తెలిపారు. అండర్ -11, అండర్ -13, అండర్ - 15 పోటీలు ఆగస్టు నెలాఖరులోను, వెటరన్ పోటీలు డిసెంబర్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

టిడిపి నేతలు విమర్శలు మానుకోవాలి

మెంటాడ: టిడిపి నాయకులు స్థాయికి మించి విమర్శలు మానుకోవాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొంపంగి గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల టిడిపి నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొరపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జడ్పీటిసి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు విషయంపై రాజన్నదొర మాట్లాడారని దానిపై టిడిపి నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 2014 నుండి 2019 వరకు ఏపి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చకు రావాలని, లేనిపోని దుర్భాషలు మాట్లాడరాదని హితవు పలికారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, సీనియర్ నాయకులు రెడ్డి రాజ అప్పలనాయుడు, కొంపంగి గ్రామ సర్పంచ్ కూనిశెట్టి వెంకటరమణ, రత్నాకర్ నాయుడు, ఇద్దనవలస సర్పంచ్ రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

బొబ్బిలి: శ్రీకాకుళంలో ఆగస్టు 11 నుండి 13 వరకు జరగనున్న అండర్ - 11 బాల, బాలికల రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుంచి పాల్గొనేందుకు క్రీడాకారులు ఎంపిక నిర్వహించనున్నట్టు చదరంగం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కోచ్ గణేష్ తెలిపారు. ఈనెల 9న బొబ్బిలిలో కళింగ వైశ్య భవనంలో మొదటి రౌండ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 11 ఏళ్ల లోపు క్రీడాకారులు చదరంగం పోటీల ఎంపికకు హాజరు కావాలని కోరారు. 2012 జనవరి ఒకటి తర్వాత పుట్టిన బాల, బాలికలు అర్హులని చెప్పారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు బర్త్ సర్టిఫికేట్ తీసుకుని రావాలన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 8న సాయంత్రం 7గంటలు లోగా 9182337499కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామానికి చెందిన ముగ్గురు కూలీలు నక్కల సత్యం, కొల్లి జగన్నాథం, రాపాక కన్నయ్య రెండు రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఓ కళాశాలలో సిమెంటు పనికి వెళ్లి అక్కడ గోడ కూలి మరణించిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మృతి చెందిన ముగ్గురు కూలీల కుటుంబాలను గురువారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మనోధైర్యం కోల్పోవద్దని అన్ని విధాలుగా పార్టీ అండదండలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల స్థాయి వైసిపి నాయకులు ఉన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

బాడంగి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా బాడంగి, వాడాడలో పెంపుడు కుక్కలకు పశువైద్య సిబ్బంది గురువారం ఉచిత యాంటీ రేబిస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గోవింద్ మాట్లాడుతూ 35 పెంపుడు కుక్కలకు టీకాలు వేశామన్నారు. జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లిమర్ల: ఎమ్మెల్యే డాక్టర్ పివిపి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు అన్నదానం చేశారు. గురువారం విజయనగరంలో బాబా మెట్ట వెలుగు వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఆశ్రమానికి నెలకి సరిపడా కిరాణా సరుకులు కూడా అందించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌టియు నాయకులు ధవళ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే సురేష్ బాబు జయంతిని పుట్టినరోజులను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ఎండి ఖలీల్ షరీఫ్, చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు ఎం రాము, పత్తిగిరి శ్రీను, గొర్ల రామానాయుడు, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని ఆతవ ఎంపిపి పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు గురువారం పరిశీలించారు. ఇంతవరకు విద్యార్థులకు జరిగిన విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట సిఆర్‌పి కాటేపల్లి ప్రసాద్ ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి బదిలీపై వెళ్లిన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు జెఆర్‌కె నాయుడును, ఆఫీస్ అసిస్టెంట్ భరద్వాజ్‌ను తోటి ఉపాధ్యాయులు గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. అనంతరం వారిద్దరికి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం

వంగర: మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని చీపురుపల్లి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు వంగర మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే సంబంధించిన రికార్డులను ఆయన వంగరలో గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ప్రస్తుతం ఆరు గ్రామాలలో జరుగుతున్న రీ సర్వేను ఈ నెల 12వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పల నరసింహులు, శంకరరావు, తరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధికి రూ. 22.48 కోట్లు

లక్కవరపుకోట: గ్రామీణ ప్రాంతాలలో మహిళల అభివృద్ధి చెందాలని వ్యాపార నిమిత్తం ఇప్పటికే జిల్లాలో రూ. 22.48 కోట్లు మంజూరు చేసినట్లు నేషనల్ రూరల్ లైవ్ వుడ్ మిషన్ కమిటీ సభ్యులు సూర్యప్రకాష్ గౌడ్, నీలందు ముఖర్జీ, గౌతమ్ రాజ్ వెల్లడించారు. గురువారం మండలానికి చేరుకున్న వారు లచ్చింపేట గ్రామ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జి సభ్యులతో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఎస్.కోట, రాజాం, గరివిడి బ్లాకులకు చెందిన 5,172 డ్వాక్రా సభ్యులకు రూ. 22.48 కోట్లు వ్యాపారి నిమిత్తం ఇచ్చామన్నారు. ఎస్ కోట బ్లాక్‌లోని 2,386 సభ్యులకు రూ9.48 కోట్లు, గరివిడి బ్లాకునకు 2,450 సభ్యులకు రూ. 10 కోట్లు, రాజాం బ్లాక్‌నకు 336 సభ్యులకు గాను రూ. 3కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. వ్యాపారాల నిమిత్తం లోన్‌లు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించడంతో హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎపిఎం అప్పలనాయుడు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆడవరంలో గడపగడపకు..

రేగిడి: మండలంలోని ఆడవరంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, కింజరాపు సురేష్ కుమార్, కృష్ణమోహన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతికి ఏర్పాట్లు

విజయనగరం టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని ఈనెల 8న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు నగరంలోని వైఎస్సార్ సర్కిల్(వెంకటలక్ష్మి కూడలి) వద్దనున్న వైఎస్ విగ్రహానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, ఇతర ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- గంట్యాడ

జగనన్న సురక్షతో పలు సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం గంట్యాడ లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంతమందికి ధ్రువపత్రాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం అందించిన పథకాలు సక్రమంగా అందలేదన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేశారని అన్నారు. ఇంటింటికి తిరిగి ధ్రువీకరణ పత్రాలు లేనివారికి ఉచితంగా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నరసింహమూర్తి, ఎంపిపి పేడాడ హైమావతి, వైసిపి సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, నారాయణ మూర్తి రాజు, డిప్యూటీ తహశీల్దార్ సత్యకుమార్, ఎంపిడిఒ బానోజీరావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజలకు రక్షణ కవచంగా ఉంటుందని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొంపంగి, మీసాలపేట గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి ఈ కార్యక్రమం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. కొంపంగి సచివాలయం పరిధిలో 740 మంది అర్జీలు పెట్టుకోగా 628 పరిష్కరించామని, మీసాల పేట గ్రామ సచివాలయ పరిధిలో 387 అర్జీలు రాగా వీటిలో 239 పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మహంతి రామనాయుడు, కూనిశెట్టి వెంకటరమణ, పంచాయతీ విస్తరణ అధికారిణి విమల, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, నాయకులు రెడ్డి రాజప్పల నాయుడు, రత్నాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని కొండగుంపాం, గుషిణి గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు పాల్గొని



కొత్తవలస: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్లు వెంకట రమణ, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠ నాయుడు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ పతివాడ అప్పన్న, నాయకులు, ఎంపిడిఒ జి.గిరిబాల, ఇఒపిఆర్‌డి బానోజీరావు, తహశీల్దార్ కెవి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్-1 వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. నగర పంచాయితీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, మేనేజర్ విశ్వేశ్వర రావు, రెవెన్యూ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట, ఆతవ గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్షలో పొంది పరిచిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా గ్రామ సచివాలయ వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం. కస్తూరి, వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎం జగన్నాథం, ఎంపిడిఒ పట్నాయక్, డిఆర్‌పేట, చామలాపల్లి, ఆతవ సర్పంచులు దండుపాటి ముత్యాలమ్మ, కోలా సతీష్, వేమననాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, నాయకులు సత్యనారాయణ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: 'జగనన్న సురక్ష' ప్రజల పాలిట శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతపాలెంలో గురువారం ఎంపిడిఒ వై. పద్మజ ఆధ్వర్యంలోనూ, తహశీల్దార్ శ్రీనివాసు మిశ్రా ఆధ్వర్యంలో గనిశెట్టిపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎస్ఎన్ పాత్రుడు, దెందేరు, గనిశెట్టిపాలెం, సంతపాలెం సర్పంచులు విరోతి వెంకట్రావు, జామి ఈశ్వరరావు, బొడ్డు చాముండేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

మండలంలోని గనిశెట్టిపాలెం, గులివిందాడ పంచాయతీకి సంబంధించి రూ.77.54 లక్షల నిధులతో నిర్మించిన బల్క్‌మిల్క్ సెంటర్, సచివాలయం, ఆర్‌బికెలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు.

ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు

- పంచాయతీ విఆర్ఒ సూత్రధారి
- అక్రమాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలో పేదల కోసం వేసిన ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు ఉదాసీనతగా ఉండడంతో చోటా నాయకులుగా చెప్పుకునే కొంతమంది నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమణలు చేపట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీకి చెందిన చోటా నాయకులు అధికార బలాన్ని వినియోగించుకుని ఖాళీ స్థలాలను ఆక్రమించేసి నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నకిలీ పట్టాలు తయారీలో పట్టణ సమీపంలో ఒక పంచాయతీలో పని చేస్తున్న విఆర్ఒ సూత్రధారిగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది.

ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న అధికార పార్టీకి చెందిన ఒకచోట నాయకుడు ఇందిరమ్మ కాలనీలో ఉన్న మసీదు సమీపంలో ఖాళీ స్థలంలో పునాదులు నిర్మించి నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ పునాదులు నిర్మాణంపై అదే కాలనీలో నివాసముంటున్న కొంతమంది వైసిపి కార్యకర్తలు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు ఫిర్యాదు చేయడంతో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రెండు రోజుల క్రితం జేసిబితో అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. ఫలితంగా



ఇక్కడున్న ఆక్రమణలనే జెసిబితో తొలగించారు..

అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలు వ్యవహారం బయట పడడంతో పట్టణంలో అధికార పార్టీ అక్రమాలపై చర్చ జరుగుతుంది.

టిడిపి హయాంలో నకిలీ పట్టాలు

గత టిడిపి ప్రభుత్వం హయాంలో నకిలీ పట్టాలు తయారు చేసి పునాదులు నిర్మించి అమ్ముకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని అప్పటి తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండు వారాలు పాటు దర్యాప్తు చేసినా అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలకు అడ్డుకట్ట పడడం లేదని విమర్శలు వస్తున్నాయి.

పంచాయతీ విఆర్ఒ సూత్రధారి

నకిలీ పట్టాలను ఒక పంచాయతీలో పని చేస్తున్న విఆర్ఒ తయారు చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఇందిరమ్మకాలనీలో ఖాళీ స్థలాలను కాలనీ నాయకులు గుర్తిస్తే ఆయా స్థలాలకు నకిలీ పట్టాలు విఆర్ఒ తయారు చేసి ఇవ్వడంతో ఆయా పునాదులను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలపై ఎమ్మెల్యేకు పిర్యాదు

ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు, నకిలీ పట్టాలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు వైసిపి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. దీంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని ఉద్దేశ్యంతో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే ఆదేశించడంతో జెసిబితో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

నకిలీ పట్టాలని నిర్ధారనైతే క్రిమినల్ చర్యలు

ఇందిరమ్మకాలనీలో నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేస్తామని నకిలీ పట్టాలుగా నిర్ధారణైతే క్రిమినల్ కేసులు పెడతామని తహశీల్దార్ డోలా రాజేశ్వర రావు అన్నారు. ఇందిరమ్మకాలనీలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని తమ పరిధిలోకి రాదని చెప్పారు. నకిలీ పట్టాలపై దర్యాప్తు చేస్తామని చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గజపతినగరం

ఈ నెల 10,11 తేదీలలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని స్థానిక సంతోట కాలనీ వద్ద అంగన్‌వాడీ నాయకులు గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని భీమా అమలు చేయాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఏ బిల్లులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నామన్నారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ సూర్యకుమారి, ఎం అనురాధ, పి పార్వతి, అప్పలకొండ పాల్గొన్నారు.

'పనిష్మెంట్' చిత్ర గీతం విడుదల

విజయనగరం టౌన్: అంకిత ఆర్ట్స్ పతాకంపై విజయనగరానికి చెందిన మన్యాల శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందించిన ' పనిష్మెంట్ ' చిత్ర గీతాన్ని డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రాస్వామి విడుదల చేశారు. గురువారం తన నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర బృందాన్ని అభినందించారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్ ప్లే, మాటలు మన్యాల శ్రీనివాసరావు అందించారు. సాంకేతిక, చిత్ర బృందంలో అధిక శాతం మంది విజయనగరం వారేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కో డైరెక్టర్ మన్యాల ఆకాష్, చిత్ర బృందం కిక్ శంకర్, ఎం.నవీన్ కుమార్, ఎం.విజయభాస్కర్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాసురాజుకు ఘన నివాళి

విజయనగరం కోట: ప్రముఖ కవి జాతీయవాది, జాతీయ నాటక పితామహుడు దాసురాజు పుండరీకాక్షుడికి గురువారం గాజులరేగలోనిశ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ బాలలు ఘన నివాళు లర్పించారు. పుండరీకాక్షుడు 125 జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌బి రామానాయుడు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 1889 జులై 6న గుంటూరు జిల్లా సత్తెనపల్లి దరి పాడిబండ గ్రామంలో జన్మించిన పుండరీకాక్షుడు జాతీయ గీతాలు రాసి జాతీయ నాటిక పితామహుడిగా ప్రసిద్ధి పొందారని అన్నారు. ఈ సందర్భంగా గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. విద్యార్తులకు స్కూల్ కరస్పాండెంట్ నారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

జగ్జీవన్‌రాం వర్ధంతి

విజయనగరం టౌన్: వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతిబాబు జగ్జీవన్‌రామ్ అని బొంగ భానుమూర్తి అన్నారు. గురువారం అయ్యప్పనగర్‌లో మాతా రమాబాయి జై భీమ్ చారిటబుల్ ట్రస్ట్, అంబేద్కర్ అందరివాడు సాధన సమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భానుమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడు, సంఘ సంస్కర్త,రాజకీయవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లన స్వాతి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గొండేల ప్రకాశ్ పాల్గొన్నారు.

సమస్యలపై టిడిపి సమావేశం

నెల్లిమర్ల: నగర పంచాయతీ సమస్యలపై టిడిపి నేతలు గురువారం నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకులు, కౌన్సిలర్లు 20వ వార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్, టిడిపి నగరపంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ మాట్లాడుతూ నగరపంచాయతీ సమస్యలతో కొట్టిమిట్టాడుతోందన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇల్లు ఇంత వరకూ లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. జగనన్న కాలనీలు, వాలంటీర్ వ్యవస్థ, వీధి దీపాలు, మంచినీటి సదుపాయం వంటి సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయన్నారు. టిడ్కో ఇళ్లను ఇంత వరకు ఇవ్వకపోగా బ్యాంకులు నుంచి లబ్ధిదారులకు డబ్బులు కట్టమని నోటీసులు రావడం అన్యాయమన్నారు.

అమ్మఒడితో విప్లవాత్మక మార్పులు

- ఎంపిపి చలంనాయుడు

ప్రజాశక్తి- బొండపల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మఒడి ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో ఎంఇఒ-2 అల్లు వెంకటరమణ ఆద్వర్యంలో ఎంఇఒ శోభారాణి అధ్యక్షతన జగనన్న అమ్మఒడి మండల స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి చలంనాయుడు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ పిల్లలని మంచి చదువు చదివించుకునేందుకు ఈ అమ్మఒడి ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాటశాలలో నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతులు కల్పించి కార్పోరేటర్ పాటశాలలకు తీసిపోని విధంగా రూపొందించిన ఘనత ముక్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గొండేల ఈశ్వర రావు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, ఎంటిసి బండారు శ్రీనువాస రావు, స్కూల్ కమిటీ చైర్మన్ గెద్ధ సత్యనారాయణ, బొండపల్లి హై స్కూల్ హెచ్ఎం ఉమా మహేశ్వరరావు, రాచకిండాం హైస్కూల్ హెచ్ఎం టి.సన్యాసిరాజు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అవసరాలకు అమ్మఒడి వరం

విజయనగరం టౌన్ : ఆర్థిక ఆసరాకు అమ్మ ఒడి పథకం వరం లాంటిదని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం అయ్యన్నపేటలోని ప్రాథమిక పాఠశాల వద్ద అమ్మ ఒడి పథకం కింద తల్లులకు నిధులు అందించే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతంగా పేద విద్యార్థుల చదువుల కోసం అమ్మ ఒడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. దీనివల్ల ప్రతి తల్లి ఎంతో ఆనందంతో పిల్లలందరినీ బడులకు పంపిస్తున్నారని తెలిపారు. ఎంపిపి మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, పిన్నింటి కళావతి, ఎంఇఒ రాజు, స్థానిక నాయకులు శైలాడ సత్యనారాయణ,లెంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గడిగెడ్డ అభివృద్ధి పట్టని మంత్రి

ప్రజాశక్తి - గుర్ల

రైతులకు ఎంతగానో ఉపయోగపడే గడిగెడ్డ అభివృద్ధి పట్టని మంత్రి బొత్స సత్యనారాయణ అవసరమా అని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టిడిపి చేపట్టిన బస్సు యాత్ర గురువారం మండలంలో అచ్యుతాపురం, పెనుబర్తి మీదుగా గడిగెడ్డ రిజర్వాయర్‌కు చేరుకుంది. ముందుగా అచ్యుతాపురంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నాగార్జున యాత్రను ప్రారంభించారు. అనంతరం గడిగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లడుతూ స్థానిక మంత్రి బొత్స సత్యనారాయణ గడిగెడ్డ అభివృద్ధి పనులను పట్టించుకోలేదన్నారు. గడిగెడ్డ కాలువ, మదుముల మరమ్మత్తులు విషయం పట్టించుకోలేదని విమర్శించారు. గడిగెడ్డను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే విజయనగరానికి తాగునీరు, రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యేలు కోండ్రు మురళి, కొండపల్లి అప్పలనాయుడు, మాజీ సభాపతి ప్రతిభ భారతి నాలుగు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

బకాయిలైనా ఇవ్వండి.. పనైనా కల్పించండి

- సిఐటియు నాయకులు రామారావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ బకాయిలైన చెల్లించాలనీ, పనైనా కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం 2016లో రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించకుండా బయటకు పంపించడం దుర్మార్గమన్నారు. గ్రాడ్యుటీ ఇవ్వలేదు సరికదా పని కూడా కల్పించక పోవడం వారు మరింత ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ వెంటనే చెల్లించాలి, లేదా పనైనా కల్పించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ కూడా యాజమాన్యం సంబంధిత అధికార్లకు గత ఆరు నెలలుగా



కార్మికులతో మాట్లాడుతున్న కిల్లంపల్లి రామారావు

చెల్లించలేదన్నారు. దీంతో కార్మికులకు రావాల్సిన పిఎఫ్ బకాయిలు, పింఛన్ సౌకర్యం పొందలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సంతలో ఘర్షణ.. వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య

రేగిడి: రెక్కాడితే గాని డొక్క నిండని ఆ కుటుంబ యజమాని కూలి పనులకు రాజాం సంతకు పశువుల వ్యాపారితో కలిసి వెళ్లాడు. అక్కడ పశువుల క్రయవిక్రయాలు కుదరక ఇద్దరు వ్యాపారుల మధ్య జరిగిన ఘర్షణలో గుండె పై బలమైన దెబ్బ తగలడంతో కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆయన స్వగ్రామం అంబఖండిలో విషాదఛాయలు అలముకున్నాయి.

మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన మండల రాము (42) కూలి పనులు చేస్తూ కుటుంబంతో జీవనం గడుపుతున్నాడు. గురువారం కావడంతో అదే గ్రామానికి చెందిన ఒక పశువుల వ్యాపారితో కూలి పనికి రాము రాజాం సంతకు వెళ్లాడు. అక్కడ ఒక వ్యాపారి పశువులను కొనుగోలు చేస్తుండగా, ఇద్దరు వ్యాపారుల మధ్య క్రయ విక్రయాలు ఒప్పందం కుదరక ఘర్షణ పడ్డారు. వీరిద్దరిని విడిపించేందుకు రాము ప్రయత్నం చేశాడు. వేరే వ్యాపారి బలంగా రాము గుండెపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న రాము భార్య చిన్నమ్మడు, కుమారుడు శివ, కుటుంబ సభ్యులు పెద్దలు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని రాజాం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. రాజాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేద కుటుంబాన్ని ఆదుకోవాలి

కూలి పనులు చేసుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్న రాము మృతితో ఆ కుటుంబం దిక్కులేనిదయ్యిందని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు కోరారు. రాముకు భార్య చిన్నమ్మడుతో పాటు కుమారులు శివ, సోంబాబు ఉన్నారు.

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కుమ్మరివీధికి కోట రాజుపై హత్యాయత్నం చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కోట రాజు ఈనెల 5న అర్ధరాత్రి తన భార్య పిల్లలతో తన ఇంట్లో నిద్రిస్తుండగాద చిన గోకవీధికి చిందిన గంధవరపు రఘు, బొగ్గులదిబ్బకు చిందిన కేత శ్రీను ఇంటిలోకి ప్రవేశించి నైలాన్ తాడుతో రాజు మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఆయనకు మెలకువ వచ్చి కేకలు వేయగా ఈ ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. రాజు భార్య శ్రీదేవికి గంధవరపు రఘుతో కొంత కాలంగా అక్రమ సంబంధం ఉంది. దీంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో రాజు అడ్డు తొలిగించాలనే ఉద్దేశంతో తన భర్తను చంపమని శ్రీదేవి కోరడంతో రఘు ఒక ఆర్ఎంపి డాక్టర్ నుండి నిద్ర మాత్రలు కొని శ్రీదేవికి ఇచ్చాడు. ఆమె ఐదో తేదీ రాత్రి మటన్ బిర్యానీలో కలిపి పెట్టింది. దీంతోనిద్రలోకి జారుకున్న తరువాత రఘుకు ఫోన్ చేసి ఇంటికి రప్పించింది. రఘు తన వరుసకు బావమరిది అయిన కేత శ్రీనును కిరాయికి మాట్లాడుకొని ఇద్దరూ వచ్చారు. వారు తెచ్చుకొన్న తాడుతో మెడకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో శ్రీదేవితోపాటు నిందితులిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

నేరాలు ఘోరాలు

అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని వీరసాగరం గ్రామనికి చెందిన రాపాక కన్నయ్య, నక్కేలా సత్యం, కొల్లి జగన్నాథం తమిళనాడులోని కోయంబత్తూరులో చనిపోయిన సంగతి తెలిసిందే. వారి మృతదేహాలను గురువారం స్వగ్రామానికి తీసికొచ్చి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సమక్షంలోనే పూర్తి చేశారు. మృత దేహాలను చూసేందుకు చుట్ట పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆ కుటుంబాలకు పెద్ద దిక్కును కోల్పోవడంతో వీరసాగరం కన్నీటి పర్యంతమైంది.



మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన వాసిరెడ్డి శ్రీదేవి(35) పడిగు పడి మృతి చెందారు. ఎస్ఐ జయంతి అందించిన వివరాలు ప్రకారం.. గురువారం పొలం పనులకు వెళ్లిన ఆమె వర్షం పడుతుందని ఇంటికి తిరిగి వెళ్లాలనుకునే సమయంలో పెద్ద పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి పాప, బాబు ఉన్నారని, భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



శ్రీదేవి(ఫైల్)

చికిత్స పొందుతూ రైతు మృతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కొట్యాడకు చెందిన రైతు కె. బంగారనాయుడు (49) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మృతుడు బంగారనాయుడు, ఆయన కుమారుడు అప్పలఈశ్వరరావు కలిసి తమ ద్విచక్ర వాహనంపై జామి మండలం అలమండ సంత నుండి స్వగ్రామానికి వస్తుండగా సంత సమీపంలో వెనుక నుండి బొలోరో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చేర్పించారు. బంగారనాయుడుకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బంగారునాయుడు మృతి చెందారు. మృత దేహానికి గ్రామంలో గురువారం అంత్యక్రియలు పూర్తి చేశారు.